జిల్లాకు భారీ వర్ష సూచన

● కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కలెక్టరేట్, జూలై 18: రానున్న మూడు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని చెప్పారు. ముందు జాగ్రత్త చర్యగా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ (08942-240557) ఏర్పాటు చేశామన్నారు మండల, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి, విద్యుత్తు శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

● ప్రజలకు సేవలందించడమే లక్ష్యంగా పనిచేయండి ● ఆస్పత్రి అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఇస్తాం
● వైసీపీ నేతల సిఫారసులపై ఉద్యోగాలు ఎందుకిచ్చారు? ● రిమ్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష
● పోస్టుమార్టంకు డబ్బులు వసూలు చేయడంపై ఆగ్రహం

శవాలపై సొమ్ములేరుకోవడం మానుకోండి

అరసవల్లి/క్రైమ్, జూలై 18: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో శవాలపై సొమ్ములేరుకునే సంస్కృతిని ఉద్యోగులు మానుకోవాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హెచ్చరించారు. రెండు రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తి మృతదేహానికి పోస్టుమార్టం చేసేందుకు రూ.1500 లంచం డిమాండ్ చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రిమ్స్ కళాశాల సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి అచ్చెన్న మాట్లాడారు. మృతిచెందిన వ్యక్తి కుటుంబ సభ్యులు తన కార్యాలయానికి సమాచారం అందించి సాయం కోరినట్లు చెప్పారు. వారికి న్యాయం చేయాలని తాను ఆదేశించినా మానవత్వం లేకుండా రిమ్స్ ఉద్యోగులు వ్యవహరించారని చీవాట్లు పెట్టారు. గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు ఇచ్చిన సిఫార్సు లేఖల ఆధారంగా ఉద్యోగాలు కల్పించడంపై మండిపడ్డారు. రిమ్స్‌లో 315 మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగు ఉద్యోగులను నియమించాలన్న ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి 365 మందిని ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. రెగ్యులర్ ఉద్యోగులు 489 మంది అవసరమైతే 257 మందినే తీసుకున్నారని, కానీ, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగు ఉద్యోగులను మాత్రం ఎక్కువగా తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే వారి పేర్లు, పూర్తి వివరాలను అందించాలని ఆదేశించారు. కొన్ని ప్రైవేటు స్వచ్ఛంద సంస్థలు నెలకు వందల సంఖ్యలో రక్తదాన శిబిరాలను నిర్వహించి రక్త నిల్వలు చేస్తున్నాయని, రిమ్స్‌లో మాత్రం ఎటువంటి రక్తసేకరణ కార్యక్రమాలు చేపట్టడం లేదన్నారు. దీనిపై రిమ్స్ బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జి డాక్టర్ సునీత వివరణ కోరగా.. తాము కళాశాలల్లో రక్తసేకరణ కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రస్తుతం తమ వద్ద 206 యూనిట్ల రక్త నిల్వలు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేటు రక్తసేకరణ కేంద్రాలు తమ రక్త నిల్వల నుంచి రిమ్స్‌కు కొంత పంపించాల్సి ఉన్నప్పటికీ, పూర్తిస్థాయిలో సహకరించడం లేదని తెలిపారు. రక్తనిల్వల కోసం ఒక్క ఫ్రీజర్ మాత్రమే పనిచేస్తోందని, మిగతా రెండు ఫ్రీజర్లు పనిచేయడం లేదని వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. జిల్లాలోని ప్రతీ ఎమ్మెల్యేకు రక్తసేకరణ కోసం ఓ లేఖ రాయాలని, హీరోల అభిమానులు, యువత ప్రైవేటు సంస్థల్లో కన్నా రిమ్స్ ఆసుపత్రిలో రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రిమ్స్‌కు సరఫరా అవుతున్న మందుల గురించి మంత్రి ఆరా తీశారు. ఇక్కడ అందుతున్న వైద్య సేవలపై రోగులు ఫిర్యాదు చేసేందుకు 2014లో టీడీపీ హయాంలో ప్రతీ వార్డులో ఫిర్యాదు పెట్టెలను ఏర్పాటు చేశామని, అవి ఇప్పుడు కనిపించడం లేదని మంత్రి అన్నారు. తక్షణమే వాటిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అంబులెన్సు సర్వీసులను మెరుగుపరచాలని, కిలోమీటరు ప్రాతిపదికన సర్వీసు చార్జీలు తీసుకోవాలని సూచించారు. రోగులను దోచుకునే పద్ధతిని ఇకపై మానుకోవాలని, లేదంటే అధికారులపై వేటు తప్పదని హెచ్చరించారు.

నివేదిక అందించండి..

వైసీపీ పాలనలో రిమ్స్ అభివృద్ధి కోసం మంజూరైన నిధులు, చేపట్టిన పనులపై పూర్తిస్థాయి నివేదికను పది రోజుల్లో అందించాలని ఇంజనీరింగ్ అధికారిని మంత్రి ఆదేశించారు. రోగులకు రూట్ మ్యాప్‌తో కూడిన వాతావరణాన్ని కల్పించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం ఎంతైనా నిధులు సమకూరుస్తామన్నారు. కానీ వచ్చే సంవత్సరంలోగా ఆసుపత్రిని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపే విధంగా ప్రణాళికలు, సేవలు ఉండాలని ఆదేశించారు. ఉద్యోగుల ఖాళీల వివరాలు, అభివృద్ధి పనుల వివరాలు తనకు అందించాలన్నారు. ఓపీ కేంద్రాల వద్ద రోగులకు ఫ్యాన్లు, కుర్చీలు ఏర్పాటు చేయాలని సూచించారు. త్వరలో మరోసారి రిమ్స్ ఆసుపత్రిని తనిఖీ చేసేందుకు వస్తానని, పరిస్థితుల్లో మార్పు రాకుంటే ఉద్యోగులపై వేటు తప్పదని హెచ్చరించారు.

కేజీహెచ్‌కు రిఫర్ చేయడం మానుకోవాలి..

రిమ్స్‌కు వచ్చే రోగులను విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేయడాన్ని మానుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. 910 పడకలు, వందల మంది ఉద్యోగులు, వైద్యులు, వైద్య పరికరాలు ఉన్నప్పటికీ రోగులను కేజీహెచ్‌కు సిఫారసు చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీనివల్ల సరైన సమయానికి వైద్య అందక చాలామంది చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరికీ వైద్యం అందేలా రిమ్స్ సిబ్బంది పనిచేయాలన్నారు. ఆసుపత్రికి 132 మంది సెక్యూరిటీ సిబ్బంది అవసరం ఉందని, కానీ 102 మందిని మాత్రమే నియమించారని ఆర్ఎంవో సుభాషిణి మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీనివల్ల పర్యవేక్షణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. అయితే, రికార్డుల ఆధారంగా 132 మంది విధుల్లో ఉన్నట్లు, మరో 17 మంది కొరత ఉన్నట్లు రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ షకీలా మంత్రికి వివరించారు.

పరిశుభ్రంగా ఉంచాలి..

రిమ్స్‌లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అచ్చెన్నాయుడు ఆదేశించారు. అన్ని వార్డులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని, లేదంటే కాంట్రాక్టును రద్దు చేస్తామని హెచ్చరించారు. తమకు నెల రోజులుగా జీతాలు చెల్లించడం లేదని పారిశుధ్య కార్మికులకు మంత్రి దృష్టికి తీసుకురాగా, వారికి సకాలంలో వేతనాలు చెల్లించాలని శానిటేషన్ ఇన్‌చార్జిని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఎంహెచ్‌వో మీనాక్షి, ఆర్ఎంవోలు సుభాషిణి, భానుప్రకాష్, రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటాచలం, టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి పక్కా ప్రణాళిక..

గుజరాతీపేట: జిల్లా అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ప్రగతి బాటలు వేస్తామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. నగరంలోని కోడిరామ్మూర్తి స్టేడియం పున:నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి అచ్చెన్నాయుడు ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌తో కలిసి ఆర్అండ్‌బీ, క్రీడా శాఖ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్టేడియం నిర్మాణాన్ని ఏడాదిలో పూర్తిచేస్తామని తెలిపారు. శ్రీకాకుళం- ఆమదాలవలస రహదారికి అత్యవసరంగా కోటి రూపాయలు నిధులు ఇచ్చామని, కొత్త రోడ్డు జంక్షన్ నుంచి వాకలవలస వరకు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడతామని చెప్పారు. గత ఐదేళ్లలో వంశధార నుంచి చుక్క నీరు పలాస, వజ్రపుకొత్తూరులకు ఇవ్వలేకపోయారని, తాము వచ్చిరాగానే రూ.90 లక్షలతో కాలువలను అభివృద్ధి చేసి 1.70 లక్షల ఎకరాలకు నీరు అందిస్తున్నట్లు తెలిపారు. మూలపేట పోర్టు పూర్తిచేసి, అక్కడే మినీ ఎయిర్‌పోర్టు నిర్మిస్తామన్నారు. ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, కొత్త గిడ్డంగులు కూడా నిర్మిస్తామని తెలిపారు.



స్టేడియం పనుల కోసం పూజ చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్

● అక్రమాలకు పాల్పడుతూ ఇతరులపై నెపం
● రూ.10 లక్షల విలువైన తలనీలాలు మాయం?
● దినసరి ఉద్యోగులకూ బెదిరింపులు



ఆదిత్యాలయంలో అనధికారులు

(అరసవల్లి)

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అనధికారుల హవా ఎక్కువైంది. వీరివల్ల ఆలయ ప్రతిష్ఠ దిగజారుతుందని భక్తులు, అర్చకులు ఆవేదన చెందుతున్నారు. చక్కదిద్దాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పర్మినెంట్ చేయిస్తానని ఆలయంలోని దినసరి ఉద్యోగుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు గతంలో ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన ఉద్యోగిపై అధికారులకు ఫిర్యాదు అందిన విషయం తెలిసిందే. దీంతో విశాఖపట్నం నుంచి డీసీ స్థాయి అధికారి ఆదిత్యాలయానికి వచ్చి విచారణ చేపట్టి, నివేదికను పైఅధికారులకు పంపారు. కానీ, విచారణ సమయంలో ఫిర్యాదు చేసిన వ్యక్తి గానీ, ఆరోపణలకు గురైన వ్యక్తి గానీ లేరు. ఈ మొత్తం కథలో దేవదాయ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసి, మళ్లీ ఆదిత్యాలయంలో కన్సాలిడేటెడ్ వేతనంపై విధుల్లో చేరిన ఉద్యోగి, అలాగే కంప్యూటర్ ఆపరేటర్‌గా దినసరి వేతనంపై పనిచేస్తున్న (ప్రస్తుతం మాజీ ఉద్యోగి) ప్రమేయం ఉందని, ఈ ఇద్దరి ప్రోద్బలంతోనే ఈ తతంగమంతా నడిచిందని ఆరోపణలు ఉన్నాయి.

పట్టించుకోని అధికారులు..

కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసిన వ్యక్తి గతంలో అవినీతికి పాల్పడ్డారని, ఫేక్ ఆర్డర్‌తో ఇన్నాళ్లు ఆలయంలో ఉద్యోగిగా కొనసాగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈయన, రిటైర్డు ఉద్యోగి (కమిషనర్ తన బంధువని చెబుతున్న వ్యక్తి)తో కలిసి ఆదిత్యాలయంలో జరిగే విషయాలను బయటకు చేరవేయడం, దినసరి ఉద్యోగులను బెదిరించడం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో మాజీల మాటకు ఎదురులేకుండా పోయిందని పలువురు దినసరి ఉద్యోగులు వాపోతున్నారు.

● గతంలో సీనియర్ అసిస్టెంట్‌పై విచారణ సమయంలో కూడా తమకు అనుకూలంగా వాంగ్మూలం ఇవ్వకపోతే తక్షణమే విధుల నుంచి తొలగిస్తామని ఈ మాజీ ఉద్యోగులు దినసరి వేతన ఉద్యోగులను బెదిరించారు. దీంతో తమకు న్యాయం చేయాలని 36 మంది దినసరి ఉద్యోగులు సంతకాలు చేసి మరీ శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌కు ఫిర్యాదు చేశారు.

తలనీలాల వ్యవహారం ఇతరులపై..

గత నెల సుమారు రూ.10 లక్షల విలువ చేసే తలనీలాలు రాత్రివేళలో మాయమయ్యాయని, ఓ ఉన్నతాధికారికి తెలిసే ఇది జరిగిందని ఆరోపణలు వినిపించాయి. గతంలో తలనీలాలను వేలం పాటలో దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు చెందిన బాబాయి అనే వ్యక్తి చేతిలో తలనీలాలు భద్రపరిచే గది తాళాలు ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీన్ని కూడా విశాఖపట్నం బదిలీ అయిన ఓ ఉద్యోగిపై నెట్టేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. తలనీలాల ఘటన వెలుగుచూడడంతో బాబాయి నుంచి అధికారులు తాళాలు తీసుకుని అతన్ని పంపించేశారు. తరువాత తలనీలా గది వద్ద భద్రత కోసం సిబ్బందిని కేటాయించాలని పోలీసులను ఈవో కోరడం విశేషం. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి పరిస్థితులను చక్కదిద్దాలని, ఆలయ ప్రతిష్ఠను, గౌరవాన్ని కాపాడాలని భక్తులు కోరుతున్నారు. ఈ విషయాలపై ఈవోను వివరణ కోరగా.. మరో వారం రోజుల్లో బదిలీ చేయించుకుని వెళ్లిపోతానని చెప్పడం విశేషం.



రాజేష్ మృతదేహాన్ని మోస్తున్న ఆర్మీ అధికారులు

వీరుడా.. జోహార్లు

● ఆర్మీ లాంఛనాలతో రాజేష్ అంత్యక్రియలు ● మంత్రి, కలెక్టర్, ఎస్పీ నివాళులు

సంతబొమ్మాళి, జూలై 18: ఉగ్రవాదుల కాల్పుల్లో వీరమరణం పొందిన సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్రకు చెందిన ఆర్మీ జవాన్ డొక్కరి రాజేష్ (25) అంత్యక్రియలు ఆర్మీ లాంఛనాలతో గురువారం జరిగాయి. రాజేష్ మృతదేహం జమ్మూ నుంచి జైపూర్‌కు, అక్కడి నుంచి విశాఖకు బుధవారం రాత్రి చేరుకుంది. విశాఖ నుంచి మృతదేహాన్ని ఆర్మీ అధికారులు ప్రత్యేక వాహనంలో చెట్లతాండ్రకు తీసువచ్చారు. కోటబొమ్మాళి మండలం కొత్తపేట నుంచి యువకులు, చుట్టు పక్కల గ్రామస్థులు వేలాదిమంది వీరుడా నీకు వందనం, జై జవాన్...జై భారత్ అంటూ నినాదాలు చేస్తూ చెట్లతాండ్ర వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజల సందర్శనార్థం కొంతసేపు మృతదేహాన్ని ఇంటివద్ద ఉంచారు. తల్లిదండ్రులు చిట్టివాడు, పార్వతి, తమ్ముడు మధుసూధన్‌రావు బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆర్మీ, ఎస్‌సీసీ పోలీస్ అధికారులు రాజేష్ మృతదేహంపై జాతీయ జెండా కప్పి మౌనం పాటించారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కే.వి.మహేశ్వరరెడ్డి, టెక్కలి సబ్ కలెక్టర్ నూరల్ కమల్, తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు నివాళులు అర్పించారు. అనంతరం మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించారు. అక్కడ ఆర్మీ, ఎస్‌సీసీ పోలీస్ అధికారులు మూడు రౌండ్లు గాల్లో కాల్పులు జరిపి నివాళులు అర్పించారు. తండ్రి చిట్టివాడు తలకొరివి పెట్టి నిప్పు అంటించాడు. ఆర్మీ అధికారులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది రాజేష్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

జవాను మృతి బాధాకరం..

నందిగాం: ఉగ్రదాడిలో ఆర్మీ హవల్దార్ సనపల జగదీశ్వరరావు మృతిచెందడం బాధాకరమని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆయన గురువారం సాయంత్రం వల్లభరాయుడుపేట వెళ్లి జగదీశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించారు. జగదీశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



గౌరవ వందనంగా గాల్లోకి కాల్పులు జరుపుతున్న జవాన్లు

బాలుడిపై కుక్క దాడి

● తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరిక ● యజమానిపై పోలీసుల కేసు నమోదు

ఆమదాలవలస, జూలై 18: మండలంలోని చిన్న జొన్నవలస నిర్వాసిత కాలనీకి చెందిన చల్లా సతీష్ (11) అనే బాలుడిపై గురువారం కుక్క దాడి చేసింది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. అయితే, ఓ వ్యక్తి కావాలనే కుక్కను ఉసిగొల్పి తన కుమారుడిపై దాడి చేసేలా చేశాడని బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్ఐ కె.వెంకటేష్, బాధిత కుటుంబం వివరాల ప్రకారం.. చిన్నజొన్నవలస నిర్వాసిత కాలనీలో మహేశ్వరరావు, అచ్యుతరావు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ రెండు కుటుంబాల మధ్య గత కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నాయి. గురువారం మహేశ్వరరావు కుమారుడు సతీష్ సైకిల్‌పై వీధిలో వెళుతుండగా అచ్యుతరావు తన కుక్కను ఉసిగొల్పాడు. దీంతో కుక్క దాడి చేయడంతో సతీష్ శరీరంపై పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. బాలుడు కేకల వేయడంతో తల్లిదండ్రులు అక్కడకు చేరుకొని కుక్క బారి నుంచి కాపాడారు. వెంటనే సతీష్‌ను ఆమదాలవలస 30 పడకల ఆసుపత్రికి తరలించారు. దీనిపై మహేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.



గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సతీష్

ఘనంగా గాంధమ్మ సంబరం

● జాతిపితకు పూజలు చేసి ఉభాలు ప్రారంభించిన రైతులు



గాంధమ్మ చిత్రపటానికి పూజలు చేస్తున్న మహిళలు

పలాస రూరల్, జూలై 18: మండలంలోని కేదారిపురం గ్రామంలో గురువారం గాంధమ్మ (మహాత్మా గాంధీ) సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గాంధమ్మ ఆలయానికి రైతులు, మహిళలు చేరుకుని గాంధీ చిత్రపటానికి పూజలు చేశారు. వివిధ ఆహారపదార్థాలు, పూలు, పండ్లను నైవేద్యంగా పెట్టారు. ముందుగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. గాంధమ్మకు పూజల అనంతరం పొలాల్లో ఉభాల పనులను ప్రారంభించారు. కాగా, కేదారిపురంలో గాంధీని గాంధమ్మగా కొలవడం ఆనవాయితీగా వస్తోంది. స్వాతంత్రోద్యమ కాలంలోనే ఈ గ్రామంలో గాంధమ్మ పేరుతో ఆలయాన్ని నిర్మించారు. ఏటా ఖరీఫ్ సీజన్‌లో నాట్లు వేసే సమయంలో గ్రామదేవతలను పూజించినట్లుగానే గాంధమ్మను రైతులు పూజిస్తారు. అనంతరం పనులను ప్రారంభిస్తారు. ఈ ఏడాది కూడా గాంధమ్మ సంబారాన్ని ఘనంగా నిర్వహించారు.

హెల్మెట్‌తో ప్రాణానికి రక్ష

● జిల్లా ప్రధాన న్యాయాధికారి

గుజరాతీపేట, జూలై 18: ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని, ఇది ప్రాణానికి రక్షణగా నిలుస్తుందని జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. హెల్మెట్ వినియోగంపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా కోర్టు అవరణ నుంచి డే అండ్ నైట్ కూడలి వరకు ఈ ర్యాలీ సాగింది. ముందుగా జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీసు యంత్రాంగంతో సమావేశం నిర్వహించారు. హెల్మెట్ వాడకంతో కలిగే లాభాలను వాహనదారులకు తెలియజేయాలని సూచించారు. ఈ ర్యాలీలో న్యాయాధికారులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా న్యాయాధికారి, తదితరులు

జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశాలు



నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌వీఎస్)- దేశ వ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 'జవహర్ నవోదయ విద్యాలయ సెలెక్షన్ టెస్ట్(జేఎన్‌వీఎస్‌టీ) 2025' ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఇవి కో-ఎడ్యుకేషనల్ రెసిడెన్షియల్ స్కూళ్లు. బాల బాలికలకు విడివిడిగా హాస్టల్స్ ఉంటాయి. భోజన, వసతి సౌకర్యాలతోపాటు పన్నెండో తరగతి వరకు బోధన ఉచితం. యూనిఫాం, పాఠ్య పుస్తకాలు కూడా ఇస్తారు.

అర్హత: ప్రస్తుతం ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో అయిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్ఐఓఎస్ నుంచి 2024 సెప్టెంబరు 15 నాటికి 'బి' సర్టిఫికెట్ కాంపిటెన్సీ కోర్సు పూర్తిచేసేవారు కూడా అర్హులే. విద్యార్థులు 2013 మే 1 నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించి ఉండాలి.

జేఎన్‌వీ సెలెక్షన్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం 2 గంటలు. మొత్తం మార్కులు 100. ఈ పరీక్షలో మూడు సెక్షన్లు ఉంటాయి. వీటిలో మొత్తం 80 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌లో 40 ప్రశ్నలు అడుగుతారు. దీనికి 50 మార్కులు కేటాయించారు. అర్థమెటిక్ టెస్ట్, లాంగ్వేజ్ టెస్ట్‌ల్లో ఒక్కోదానిలో 20 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో దానికి 25 మార్కులు ఉంటాయి. నెగెటివ్ మార్కులు లేవు. మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌కు గంట; మిగిలినవాటికి ఒక్కోదానికి అర్ధ గంట పరీక్ష సమయం ఇస్తారు. విద్యార్థులు బ్లూ/బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద సమాధానాలు గుర్తించాలి. తెలుగు రాష్ట్రాల్లో ఈ పరీక్షని తెలుగు, హిందీ, ఇంగ్లీష్, మరాఠీ, ఉర్దూ, ఒరియా, కన్నడ మాధ్యమాల్లో నిర్వహిస్తారు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **జేఎన్‌వీ సెలెక్షన్ టెస్ట్ తేదీలు:** 2025 జనవరి 18, ఏప్రిల్ 12
- **వెబ్‌సైట్:** www.navodaya.gov.in

దిక్సూచి DIKSUCHI


సీఈసీఆర్ఐలో బీటెక్

కరైకుడి(తమిళనాడు)లోని సెంట్రల్ ఎలక్ట్రోకెమికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎస్ఐఆర్-సీఈసీఆర్ఐ)-బీటెక్ (కెమికల్ అండ్ ఎలక్ట్రోకెమికల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో అదర్ స్టేట్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. జేఈఈ మెయిన్ 2024 ఆలిండియా ర్యాంక్ ఆధారంగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 6
- **ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** ఆగస్టు 9
- **ఆన్‌లైన్ కౌన్సెలింగ్:** ఆగస్టు 21
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 23
- **వెబ్‌సైట్:** cecri.res.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/NKB5u7vలో చదవండి.

ఐఐఎఫ్‌టీలో ఆన్‌లైన్ పీజీ డిప్లొమా



ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- ఎగ్జిక్యూటివ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(ఈపీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది 15 నెలల వ్యవధి గల వీకెండ్ ప్రోగ్రామ్. ఇందులో మూడు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి రెండు సెమిస్టర్లు పూర్తయిన తరవాత ప్రోగ్రామ్‌లో బ్రేక్ తీసుకోవచ్చు. గరిష్ఠంగా మూడేళ్లలో ప్రోగ్రామ్‌ను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌ని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. వారాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు వరకు సెషన్స్ ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా పోర్ట్ విజిట్, ఇండస్ట్రీ విజిట్, రీసెర్చ్ ప్రాజెక్ట్, అసైన్‌మెంట్స్ ఉంటాయి. సెలెక్షన్ కమిటీ నిర్ణయం మేరకు అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం అయిదేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

మ్యాట్ నోటిఫికేషన్

ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ)-మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(మ్యాట్) 2024 ఆగస్టు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా దేశంలోని ప్రముఖ బిజినెస్ స్కూళ్లు అందిస్తున్న మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

మ్యాట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో అయిదు సెక్షన్‌లు ఉంటాయి. సెక్షన్‌కు 30 ప్రశ్నలు చొప్పున మొత్తం 150 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

ఐబీటీ షెడ్యూల్: ఆగస్టు 14న ఎగ్జామ్ రాయాలనుకొనేవారు ఆగస్టు 9లోపు, ఆగస్టు 23న పరీక్ష రాయాలంటే ఆగస్టు 18లోపు దరఖాస్తు చేసుకోవాలి.

సీబీటీ షెడ్యూల్: చివరి తేదీ: ఆగస్టు 11
- **సీబీటీ టెస్ట్ తేదీ:** ఆగస్టు 18

పీబీటీ షెడ్యూల్: చివరి తేదీ: ఆగస్టు 18
- **పీబీటీ టెస్ట్ తేదీ:** ఆగస్టు 25
- **వెబ్‌సైట్:** mat.aima.in

పంచకర్మ టెక్నీషియన్ కోర్సు

భారత ఆయుష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్(సీసీఆర్ఏఎస్)- పంచకర్మ టెక్నీషియన్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఏడాది వ్యవధి గల సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ రెగ్యులర్ నాన్ రెసిడెన్షియల్ కోర్సు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ట్రెయినింగ్ పూర్తయ్యేనాటికి అభ్యర్థులకు 18 ఏళ్లు నిండాలి.

- **రిజిస్టర్డ్/స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 31
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** అక్టోబరు 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.ccras.nic.in

మరో రికార్డును సాధించిన కల్కి



విడుదలైన మొదటి రోజు నుంచే హిట్ టాక్ తెచ్చుకుని వరుస రికార్డులు సృష్టిస్తోంది 'కల్కి 2898 ఏ.డీ' సినిమా. ఇటీవలే రూ.1000 కోట్లు సాధించిన ఏడవ ఇండియన్ సినిమాగా.. రెండవ ప్రభాస్ సినిమాగా నిలిచింది. ఈ రికార్డుల వేటలో భాగంగా ఈ సినిమా మరో అరుదైన ఘనతను సాధించింది. టికెట్ బుక్కింగ్స్ అప్లికేషన్ 'బుక్ మై షో'లో అత్యధిక టికెట్స్ బుక్ అయిన సినిమాగా ఖ్యాతి గడించింది. 12.15 మిలియన్స్ (దాదాపు రూ.1 కోటి 25 లక్షలు) టికెట్స్ బుక్ అయిన ఈ సినిమా అంతకుమందు 'జవాన్' సినిమా పేరిట ఉన్న రికార్డును తిరగరాసింది. 'జవాన్' 12.01 (దాదాపు రూ.1 కోటి 20 లక్షలు) మిలియన్స్ టికెట్ బుకింగ్స్‌తో ప్రస్తుతం రెండో స్థానంలో ఉంది. కాగా, నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ పాన్ ఇండియన్ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్‌లో ప్రభాస్ 'భైరవ' పాత్రలో.. అమితాబ్ బచ్చన్ పురాణ యోధుడు 'అశ్వత్థామ'గా..కమల్ హాసన్, దీపికా పదుకొనే, రాజేంద్ర ప్రసాద్ కీలక పాత్రల్లో అలరించారు. ఈ సినిమాకు కొనసాగింపుగా పార్ట్-2 తెరకెక్కనుందని చిత్ర బృందం ప్రకటించిన సంగతి తెలిసిందే.

నిన్ను కన్న కనులే




తమిళ చిత్రకథానాయకుడు విజయ్ నటిస్తున్న తాజా చిత్రం 'ది గోట్' (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలయ్యాయి. సినిమాలోని రెండో పాట 'నిన్ను కన్న కనులే'ను గురువారం విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ ఫ్యామిలీ సాంగ్‌ను యువన్ శంకర్‌రాజా, ఎస్పీ చరణ్, చిత్ర పాడారు. విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో ప్రశాంత్, ప్రభుదేవా, మోహన్, జయరామ్, స్నేహ, లైలా, మీనాక్షి చౌదరి తదితరులు ఇతర ముఖ్య తారాగణం. కల్పాతి ఎస్ అఘోరమ్, కల్పాతి ఎస్.గణేశ్, ఎస్.సురేశ్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తోంది. వెంకట్ ప్రభు దర్శకుడు.

ఘట్టమనేని వంశం నుంచి మరో హీరో



హీరో కృష్ణ మనవడు, నటుడు, నిర్మాత రమేశ్‌బాబు తనయుడు జయకృష్ణ హీరోగా అరంగేట్రం చేస్తున్నారు. తన పుట్టినరోజు సందర్భంగా గురువారం పద్మాలయా సంస్థ కార్యాలయంలో అభిమానుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో జయకృష్ణ కేక్ కట్ చేశారు. దివంగత రమేశ్‌బాబు సతీమణి, జయకృష్ణ తల్లి మృదుల ఈ సందర్భంగా మాట్లాడుతూ 'బాబు కోసం కొన్ని కథలు విన్నాం. అందరం కలసి ఓ కథను ఎంపిక చేస్తాం. మంచి బేనర్ ద్వారా చక్కని సినిమాతో జయకృష్ణ త్వరలోనే మీ ముందుకు వస్తాడు' అని చెప్పారు. అభిమానులందరికీ జయకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్యంతో బాధపడుతున్న జాన్వీ కపూర్



బాలీవుడ్ నటి జాన్వీకపూర్ ఇటీవలే 'మిస్టర్ అండ్ మిసెస్ మహీ' చిత్రంతో ప్రేక్షకులను అలరించారు. ఓ పక్క బాలీవుడ్ చిత్రాల్లో నటిస్తూనే.. టాలీవుడ్‌లోనూ ఎన్టీఆర్, రామ్‌చరణ్, నాని సినిమాల్లో కథానాయిక పాత్రను పోషిస్తున్నారీ బ్యూటీ. తాజాగా, ఆమె అనారోగ్యానికి గురయ్యారు. ఫుడ్ పాయిజనింగ్ వల్ల తీవ్ర అనారోగ్యానికి గురైన ఆమెను ముంబైలోని హాస్పిటల్‌లో చేర్చారు. జాన్వీ ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నారని.. తన కూతురి ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు ఆమె తండ్రి బోనీ కపూర్ వెల్లడించారు. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడ్డాక ఆమెను హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ చేస్తారని ఆయన చెప్పారు. ప్రస్తుతం జాన్వీ కపూర్ 'ఉలఝ్' అనే చిత్రంలో నటించారు. ఇందులో ఆమె పోషించే పాత్ర పేరు సుహాన భాటియా. దేశంలో అతి పిన్న వయసులోనే డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఎదిగిన సుహాన భాటియా విజయ ప్రస్థానమే ఈ సినిమా కథాంశం. సినిమా ఆగస్టు 2న విడుదలవుతోంది.

దీపావళికి రాకీ రాక




విష్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మెకానిక్ రాకీ'. కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంతో రవితేజ ముళ్లపూడి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో విష్వక్ సరసన మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీని మేకర్స్ ఖరారు చేశారు. దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న 'మెకానిక్ రాకీ' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో విష్వక్‌సేన్ గన్, రెంచ్ పట్టుకొని గంభీరమైన లుక్‌లో కనిపించారు. వైవా హర్ష, హర్షవర్ధన్ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: సత్యం రాజేశ్, విద్యాసాగర్ జె, సినిమాటోగ్రఫీ: మనోజ్ కటసాని, ఎడిటర్: అన్వర్ అలీ

వారం రోజుల ముందుగానే..



రక్షిత్ అట్లూరి హీరోగా నటించిన తాజా చిత్రం 'ఆపరేషన్ రావణ్'. న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా దర్శకుడు వెంకట్ సత్య రూపొందించారు. తెలుగు, తమిళ భాషల్లో తయారైన ఈ సినిమాలో సంగీర్తన కథానాయిక. ముందు అనుకున్నట్లు కాకుండా వారం రోజుల ముందుగానే అంటే ఈ నెల 26న సినిమాను విడుదల చేస్తున్నట్లు చిత్ర నిర్మాత ధ్యాన్ అట్లూరి చెప్పారు. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చిందని ఆయన తెలిపారు. రాధిక శరత్‌కుమార్ ఓ కీలక పాత్ర పోషించిన ఈ చిత్రంలో చరణ్‌రాజ్, విద్యాసాగర్, రాకెట్ రాఘవ, రఘు కుంచె ఇతర ముఖ్య తారాగణం.

కశ్మీర్ నేపథ్యంలో...



శివ కార్తికేయన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'అమరన్'. కమల్‌హాసన్ తన సొంత బేనర్ రాజ్‌కమల్ ఇంటర్నేషనల్ ఫిల్మ్స్‌పై సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్‌తో కలసి నిర్మిస్తున్నారు. సాయిపల్లవి కథానాయిక. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న 'అమరన్' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ బుధవారం ప్రకటించారు. ప్రముఖ జర్నలిస్ట్, రచయిత శివ్ అరూర్ రచించిన 'ఇండియన్ మోస్ట్ ఫియర్‌లెస్' పుస్తకంలోని 'మేజర్ వరదరాజన్' జీవిత గాథ ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. కశ్మీర్ నేపథ్యంలో యాక్షన్ ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో సరికొత్త పాత్రలో శివకార్తికేయన్ కనిపించనున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సీహెచ్ సాయి.

ట్రోలర్స్‌పై డీజీపీకి 'మా' ఫిర్యాదు

సోషల్ మీడియా వేదికల ద్వారా సినిమా తారలపై జరుగుతున్న ట్రోలింగ్‌పై 'మా' (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) చర్యలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో భాగంగా 'మా' సభ్యులైన శివ బాలాజీ, రాజీవ్ కనకాల, శివకృష్ణ తెలంగాణ డీజీపీ జితేందర్‌ను కలసి వినతి పత్రం అందించారు. అందులో ఈ ట్రోలింగ్స్‌కు పాల్పడుతున్న 250 యూట్యూబ్ చానళ్లపై చర్యలు తీసుకోవాలని 'మా' సభ్యులు డీజీపీని కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన డీజీపీ.. సైబర్ సెక్యూరిటీ సహకారంతో ఈ అంశంపై చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని.. అందులో ఇటువంటి ట్రోలర్స్‌పై నిఘా పెడతామని 'మా' సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 'మా' సభ్యులు మాట్లాడుతూ "ఈ ట్రోలింగ్స్ హద్దులు దాటిపోయాయి. వీటి వల్ల చాలా మంది నటీనటులు ఇబ్బంది పడుతున్నారు. 24 గంటల్లోపు ఓ ప్రత్యేక కో ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసి ట్రోలింగ్ చేసే చానళ్లను గుర్తిస్తాం" అని చెప్పారు.

గ్రామాల్లో పర్యటించి సమస్యలు పరిష్కరించాలి

● పాతపట్నం ఎమ్మెల్యే గోవిందరావు

ఎల్.ఎన్.పేట: అధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవింద రావు అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ ఆర్.జ్యోతిలక్ష్మి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ప్రతినెలా మొదటివారంలో ఎమ్మెల్యే గ్రీవెన్స్‌ను ఆగస్టు నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. కొమ్మువలస, కరకవలస పాఠశాలల విద్యార్థులకు లాబ్‌ట్యాప్‌లను ఇంతవరకు ఇవ్వ లేదని సర్పంచ్‌లు జి.యోగీశ్వరరావు, ఆర్.సుశీల సమావేశం దృష్టికి తీసుకువచ్చి కారణమేంటని ఎంఈవోలను ప్రశ్నించారు. సర్పంచ్ ఎం.దివాకర్‌నాయుడు మాట్లాడుతూ పీహెచ్‌సీ వైద్యాధికారుల పనితీరు బాగోలేదని, 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదన్నారు. ఏమాత్రం అనారోగ్యం చేసినా శ్రీకాకుళం రిఫర్ చేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాడైన రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పీఆర్ జేఈ బాస్కరరావును ఆదేశించారు. యంబరాం సర్పంచ్ వి.గోవిందరావు మాట్లాడుతూ.. ఎల్ఎన్‌పేట రక్షిత నీటి పథకం మరమ్మతులకు గురైందని, జల్‌జీవన్ ద్వారా కొళాయిలు వేసినా ఇంటింటికీ నీరు రావడం లేదన్నారు. యంబరాం గ్రామంలో ఈనెల 1న ఫించన్లు పంపిణీకి వెళ్లిన సమయంలో రేషన్ సరుకులు వాహనంపై మాజీ సీఎం జగన్ ఫొటో ఉండడాన్ని గమనించి డీలర్, వాహన డ్రైవర్‌పై తగు చర్యలు తీసుకో వాలని తహసీల్దార్‌కు, రెవెన్యూ సిబ్బందికి తెలియజేస్తే ఎందుకు స్పందించలేదని డీటీ రషీద్ అహమ్మద్, సీఎస్‌డీటీ కిషోర్‌ను ఎమ్మెల్యే గోవిందరావు ప్రశ్నించారు. ఎమ్మెల్యేకు రెవెన్యూ సిబ్బంది ఇచ్చిన గౌరవ మిదేనా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే అధికారులతో సమన్వయంచేసుకొని పనులకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనాలు అమలు చేయాలి

పలాస/పలాసరూరల్: ఆశ కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేయాలని, రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి డిమాండ్ చేశారు. పలాస టీడీపీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే గౌతు శిరీషకు వినతిపత్రం అందించారు. ఆన్‌లైన్ వర్క్ చేయడానికి నాణ్యమైన ఫోన్‌లు ఇవ్వాలని, రిటైర్మెంట్‌లో గ్రాట్యూ టీ, పింఛను అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆశావర్కర్ల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. యూనియన్ నాయకులు ఎం.లావణ్య, జి.కృష్ణవేణి, లక్ష్మి, మీనా, యజ్ఞ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గౌతు శిరీషకు వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

ఉడుపు యంత్రంతో కూలీల సమస్య పరిష్కారం

మబగాం(పోలాకి): ఖరీఫ్ పనుల్లో కూలీల కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం ఉడుపు యంత్రాలను సరఫరా చేస్తోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. గురువారం మబగాంలో ఉడుపు యంత్రంతో ఉడుపు చేపట్టే కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి చిరంజీవి మాట్లాడుతూ.. రైతులకు అనువైన ఉపకరణాలను రాయితీపై ప్రభుత్వం సరఫరా చేస్తోందని, వాటిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏ రోజారత్నం, సన్యాసప్పడు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.



ఉడుపు యంత్రాన్ని నడుపుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పలాసరూరల్: పలాస డివిజన్‌లో పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ ప్రసాద్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్నందున విద్యుత్‌సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. కైజోల, మహాదేవ పురం, టెక్కలిపట్నం, కేశుపురం, బంటుకొత్తూరు, కేదారిపురం, పెదంచల, చినంచల, రాజగోపాలపురం, ఈదురాపల్లి, పూర్ణభద్ర తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ● **సంతబొమ్మాళి:** బోరుభద్ర సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ శివకుమార్ తెలిపారు. పిన్నింటిపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున బోరుభద్ర సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు, వినియోగదారులు గమనించాలని కోరారు. ● **నందిగాం:** నందిగాం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏఈ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నందిగాం, పెంటూరు, పెద్దతామరాపల్లి, కణితివూరు, హరి దాసుపురం, గొల్లూరు, దిమిలాడ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు ● **వజ్రపుకొత్తూరు:** పూండి, అక్కుపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు, చెట్టు కొమ్మలు తొలగింపు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ యోగేశ్వరరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇంటర్ విద్యార్థులకు నోట్‌పుస్తకాలు

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే ప్రభుత్వ కళాశాలల్లో చదివే ఇంటర్ విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలను ఇవ్వాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు మండల స్టాక్ పాయింట్ల నుంచి కళాశాలకు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది 43 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 7,592 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒక్కో విద్యార్థికి గ్రూపు ప్రకారం పాఠ్య పుస్తకాలతో పాటు 12 నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. గురువారం నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉర్లాం ప్లస్ ఉన్నత పాఠశాలలో పుస్తకాల పంపిణీ చేపట్టారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పాతపట్నం: లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వైఎస్‌వీవీ ప్రసాద రావు అన్నారు. మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురినున్నట్లు వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూంను గురువారం ఏర్పాటు చేశామన్నారు. వీఆర్వోలు, వీఆర్‌ఏలు ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు. లోతట్టు గ్రామాలైన చంగుడి, కె.గోపాలపురం, హెచ్‌గోపాలపురం గ్రామ ప్రజలను అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు.

పూండిలంక గ్రామాన్ని సందర్శించిన అధికారులు

వజ్రపుకొత్తూరు: పూండిలంక గ్రామాన్ని మండల రెవెన్యూ అధికారులు గురువారం సందర్శించారు. పూడిలంక దారి కొట్టుకుపోయిన నేపథ్యంలో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ ఎం.సురేష్, డీటీ వి.గిరిరాజు తదితరులు పరిశీలించారు. ఎవ్వరూ ఆందోళన చెందవద్దని, అత్యవసర సేవలు అందించేందుకు రెవెన్యూ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. సర్వేయర్ కె.తిరుపతిరావు, ఆర్ఐ పవిత్ర ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

వజ్రపుకొత్తూరు: కొత్తపేట గ్రామస్థుడు గంట పోలయ్యకు చెందిన ఆవు గురువారం మధ్యాహ్నం విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గ్రామానికి సమీపంలో మినీ ట్రాన్స్‌ఫారం తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసి చుట్టూ రక్షణ కంచె పెట్టకపోవడంతో ఆవు దానికి తగిలి మృత్యువాత పడిందని మాజీ సర్పంచ్ గోవింద పాపారావు తెలిపారు. బాధిత రైతుకు పరిహారం అందించాలని ఆయన కోరారు.

ఎత్తిపోతల ట్రాన్స్‌ఫార్మర్ రాగి వైరు చోరీ

జలుమూరు: రామచంద్రాపురం ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైరు చోరీకి గురైనట్లు ఏపీఎస్ఐడీసీ ఏఈ బి.అనిల్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని 20 కేజీల రాగివైరు సుమారు రూ.6లక్షలు విలువ చేస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు హెచ్‌సీ ధర్మారాజు తెలిపారు. ఈనెల 16న రైతులు ఎత్తిపోతల పథకం వద్దకు వెళ్లి చూడగా రాగివైరు చోరీకి గురైనట్లు గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

అనుమతి లేకుండా పాఠశాల తెరిస్తే చర్యలు

కొత్తూరు: ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా బలదలో నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలను తక్షణం మూసివేయాలని ఎంఈవోలు గోవింద్, శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ పాఠశాలపై గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం తనిఖీ చేశారు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు 36 మంది విద్యార్థులను గుర్తించారు. పాఠశాల రేపటి నుంచి తెరవకూడదని ఆదేశించారు. లేకుంటే చర్యలు తప్పవన్నారు. పాఠశాలలో చదువుతున్న పిల్లలను సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆదేశించారు.

జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రారంభం

టెక్కలి: జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కణితి కిరణ్‌కుమార్ ప్రారంభించారు. సభ్యత్వం తీసుకునే ప్రతి ఒక్కరికి రూ.5లక్షల ప్రమాద జీవిత బీమాతో పాటు రూ.50వేలు ప్రమాద బీమా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మెట్ట అవినాష్, గవరయ్య, కుమారస్వామి, సోమేష్, త్రివేణి తదితరులు ఉన్నారు. ● **కాశీబుగ్గ:** నియోజకవర్గంలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వవార్డు రెల్లివీధిలో జనసేన వలంటీర్ల ఆధ్వర్యంలో క్రియాశీలక సభ్యత్వ నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ దుర్గారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు జనసేన సభ్య త్వాలను స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కోన కృష్ణారావు, ఎస్.ధర్మారావు, ఎస్.ప్రదీప్, వంశీ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు. ● **మెళియాపుట్టి:** మండలంలోని జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ మండల నాయకుడు దుక్క బాలరాజు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సవలాపురం చంటి, చింతల ప్రశాంత్, బుర గాన సత్యనారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు. ● **నరసన్నపేట:** జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు పార్టీ క్రియాశీలక సభ్యత్వా న్ని ప్రతిఒక్కరూ తీసుకోవాలని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి బలగ ప్రవీణ్ అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన సంయుక్త కార్యదర్శి యోగ హరి, లావేటి బొజ్జమ్మ పాల్గొన్నారు.

ఆలయం నిర్మాణానికి గ్రానైట్ వితరణ

పలాసరూరల్: మాకన్నపల్లి గ్రామంలో నూతనంగా నిర్మితమవుతున్న శివాల యానికి అవసరమైన రూ.1.50 లక్షల విలువైన గ్రానైట్‌ను కాశీబుగ్గకు చెందిన దువ్వాడ శ్రీధర్ (బాబా) గురువారం అందజేశారు. ఆలయంలో ఫ్లోరింగ్ నిర్మాణానికి సహకరించాలని గ్రామస్థులు కోరగా ఆయన అంగీకరించి గ్రానైట్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధవరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులతో దువ్వాడ శ్రీధర్

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

పలాసరూరల్: మాకన్నపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆఫ్ పలాస-కాశీబుగ్గ అధ్యక్షుడు హనుమంతు ఎండు దొర, లయన్ డోకి రామారావు సౌజన్యంతో పెన్నులు, పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి టి.మాధవరావు, కోశాధికారి నెమలిపురి అప్పారావు, సంయుక్త కార్యదర్శి కుమార్ నాయక్, వెంకటరావు, పాఠశాల కమిటీ అధ్యక్షుడు మాధవరావు, కుత్తుమ వినోద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

అనుమానిత కేసుల సమాచారం ఇవ్వండి

ఈదులవలస(పోలాకి): కుష్ఠువ్యాధి సోకినట్టు అనుమానిత కేసుల సమాచారానికి పీహెచ్‌సీకి ఇవ్వాలని వైద్యాధికారి శ్రీనాథ్, విస్తరణాధికారి నల్లి రవికుమార్ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. గురువారం ఈదులవలస ఉప ఆరోగ్యకేంద్ర సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టారు. అనుమానిత కేసుల వివరాలు పంపిస్తే స్క్రీనింగ్ ద్వారా కేసులను నిర్ధారించి చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుంద న్నారు. కార్యక్రమంలో హెల్త్‌వెల్ కేంద్ర నిర్వాహకురాలు మున్నా, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

మంచినీటి బావులను మంజూరు చేయండి

సంతబొమ్మాళి: మేఘవరం పంచాయతీ సూరాడవానిపేట, ఎంపల్లివానిపేట గ్రామాలకు మంచినీటి బావులు మంజూరు చేయాలని టీడీపీ మత్స్యకార నాయకులు సూరాడ ధనరాజ్, ఎంపల్లి జోగారావు కోరారు. ఈ మేరకు గురువారం ఎంపీడీవో ప్రేమలీలను కలిసి వినతిపత్రం అందించారు. మత్స్యకార గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరారు.

అమరవీరులకు సంతాపం

మందస: ఇటీవల జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదులతో జరిగిన ఎదురుదాడుల్లో వీరమరణం పొందిన నందిగాం మండలానికి చెందిన హవల్దార్ సనపల జగదీష్, సంతబొమ్మాళి మండలానికి చెందిన జవాన్ డొక్కరి రాజేష్ మృతికి అధికారులు సంతాపం తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎ.రఘుపతిరావు ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కర్నూలులో రైతుకూలీ సంఘం మహాసభలు

హరిపురం: అఖిల భారత రైతు కూలీ సంఘం మహాసభలు కర్నూలులో శనివారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు తెలిపారు. ఈ మేరకు గురువారం రట్టి గ్రామంలో కరపత్రాలను ఆవిష్కరించారు. మహాసభలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

శ్మశానంలో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను పరిశీలిస్తున్న మండల సర్వేయర్, కాలనీ కమిటీ సభ్యులు

జగన్నాథ స్వామికాలనీ(పోలాకి): రాళ్లపాడు పంచాయతీ జగన్నాథ స్వామి కాలనీ శ్మశాన వాటికలోని ఆక్రమణలను రెవెన్యూ అధికారులు గురువారం సర్వే చేపట్టి తొలగించారు. ఆక్రమణలపై వైసీపీ హయాంలో అనేక పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని, ప్రభుత్వం మారడంతో సమస్యను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దృష్టికి తీసుకువెళ్లామని కాలనీ కమిటీ నాయకుడు, ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసి పాటి కృష్ణ తెలిపారు. ఆయన స్పందించి తక్షణం తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో డీటీ పొదిలాపు శ్రీనివాసరావు, సర్వేయర్ శ్రీరాంమూర్తి శ్మశానవాటిక ప్రాంతంలో కొలతలు వేసి ఆక్రమణలను తొలగించారన్నారు. దీంతో ఆయన హర్షం వ్యక్తం చేస్తూ అధికారులకు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో మెండ లక్ష్మి, కాలనీ కమిటీ సభ్యులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

పాతపట్నం: పాతపట్నం ఎర్ర చెరువులోని ఆక్రమణలను గుర్తించి తొలగించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల చెరువు ఆక్రమణలను పరిశీలించిన ఎమ్మెల్యే గోవిందరావు తక్షణం తగు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తహసీల్దార్ వైఎస్‌వీవీ ప్రసాదరావు ఆదేశాల మేరకు మండల సర్వేయర్ రామగణపతి, సచివాలయ సర్వేయర్ షణ్ముఖరావు, ఆర్ఐ భువన, వీఆర్వో పార్థసారధి సర్వే చేపట్టారు. ఆక్రమణలు ఎంత మేర జరిగాయో కొలతలు సేకరించారు. అయితే భారీ వర్షం కారణంగా సర్వేకి అంతరాయం కలిగింది. వర్షాలు తగ్గిన తరువాత సర్వే పూర్తి చేసి జియో ట్యాగింగ్ చేపడతామని అధికారులు తెలిపారు.



చెరువు ఆక్రమణలపై సర్వే చేస్తున్న సిబ్బంది

పనులు నిలుపుదలతో విద్యార్థులకు ఇబ్బందులు

హిరమండలం: మండలంలోని తంప జడ్పీఉన్నత పాఠశాలలో వైసీపీ ప్రభుత్వం హయాంలో చేపట్టిన రెండో విడత నాడు-నేడు పనులు అర్థంతరంగా నిలిపివేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని జడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబు అన్నారు. గురువారం ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు పేరుకుపోయి ఉండటం, విద్యుర్థులను నేలపై కూర్చొని బెట్టి పాఠాలు చెబుతుండడాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో గుర్తించిన సమస్యలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దారపు డిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు

పాతపట్నం: మహిళలపై లైంగికవేధింపులకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉందని ఎంపీడీవో కె.రామకృష్ణరాజు అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పీవోఎస్‌హెచ్ ప్రోగ్రాంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం పనిచేసేచోట మహిళలపై లైంగిక వేధింపుల నిరోధంపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 10మంది కంటే ఎక్కువగా పనిచేసే ఉద్యోగులుండే కార్యాలయాధికారులకు, సంస్థల వారికి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఐసీడీఎస్ పీవో విమలారాణి తదితరులు పాల్గొన్నారు.











ఘనంగా ఎమ్మెల్యే రూపేష్ జన్మదిన వేడుకలు

పర్లాకిమిడి: ఎమ్మెల్యే రూపేష్ కుమార్ పాణిగ్రాహి జన్మదిన వేడు కలు గురువారం ఘనంగా నిర్వహించారు. రాజ్ సీతాపురం లోని జగన్న తికేతన్ ఆశ్రమంలో చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కాశీనగర్ సమితి సీతాపూర్ పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వృద్ధులకు పెన్షన్లు అందజేశారు. అనంతరం సమితి అధ్యక్షురాలు బల్ల సాయమ్మ, సర్పంచ్ తేజ, బీజేడీ నాయకులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.



చిన్నారులకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే రూపేష్ కుమార్

3 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం

ఒడిశా

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో గంజాయిని అరికట్టేందుకు పోలీసులు అబ్కారీ శాఖా అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. గురువారం రాయగడ పోలీసు స్టేషన్ అధికారి దయానిధి బారిక్ బృందం కోయిన్పూర్ సమీపంలో పెట్రోలింగ్ చేస్తుండగా మోహన్ సమితి నుంచి ఆంధ్రా వైపు వస్తున్న వ్యాన్‌లో 3 క్వింటాళ్ల గంజాయి ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు. దీని విలువ సుమారుగా రూ.30 లక్షలు ఉంటుందన్నారు. ఇద్దరు నిందితులను కోర్టుకు తరలించామని ఆయన తెలిపారు.







రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ మృతి


శ్రీకాంత్ (ఫైల్)

సోంపేట: సోంపేట-బారువ రహదారిలోని కంబ ప్రాంతంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ తెలుకల శ్రీకాంత్ సాహు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తెలుకల శ్రీకాంత్ తన చిన్నాన్న కుమారుడు తెలుకల వంశీతో కలిసి ద్విచక్ర వాహనంపై సోంపేట వెళ్లారు. తిరిగివస్తూ కంబ ప్రాంతంలో మరమ్మతులకు గురై రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. ఈ ఘటనలో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతిచెందగా.. గాయపడిన వంశీని చికిత్స నిమిత్తం బారువ ఆసుపత్రికి తరలించారు. కాగా శ్రీకాంత్‌కు తండ్రి పార్వతీశం, తల్లి జున్ను, సోదరుడు, సోదరి ఉన్నారు. ఎనిమిదేళ్ల కిందట ఆర్మీలో చేరి ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లో విధులు నిర్వహిస్తూ.. ఆరు రోజుల కిందట సెలవుపై గ్రామానికి వచ్చాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. బారువ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్క పోయిందని ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైం: స్థానిక 80 అడుగుల రోడ్డులోని ఓ హోటల్ యజమాని వి.శ్రీనివాస్ తాను పెంచుకుంటున్న కుక్కను దొంగతనం చేశారంటూ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన హోటల్‌లో పెంచుకుంటున్న జెర్మన్‌షెపర్డ్ జాతికి చెందిన కుక్కను గురువారం సాయంత్రం సమీపంలో ఉన్న విద్యా సంస్థలో చదువుతున్న విద్యార్థి, మరో వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చి పట్టుకెళ్లినట్టు సీసీ ఫుటేజీలో రికార్డు అయిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాగా తొలిసారి కుక్కపోయిందన్న ఫిర్యాదు రావడంతో సర్వత్రా ఈ విషయం చర్చనీయాంశమైంది.

పొందూరులో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ ఇవ్వాలి


వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

పొందూరు: స్థానిక రైల్వేస్టేషన్‌లో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ను నిలుపుదల చేయాలని ఈస్ట్‌కోస్ట్ రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ బీవీజీ ప్రసాద్‌ను పొందూరు రైల్వే స్టేషన్ బీజేపీ కన్సల్టేటివ్ సభ్యులు కోరారు. గురువారం ఆయన పొందూరు రైల్వే స్టేషన్‌ను సందర్శించి, నిర్వహించిన సమావేశంలో సభ్యులు పాల్గొని ఇక్కడి సమస్యలు వివ రిస్తూ.. వినతిపత్రం అందించారు. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ను నిలపాలని, పొందూరు- సంతకవిటి రోడ్డులో ఫ్లైఓవర్ నిర్మించాలని, రాత్రి ఒంటి గంటకు వచ్చే పూరి- తిరుపతి టైమింగ్‌ను మార్పు చేయాలని, పొందూరు మీదుగా విశాఖకు మరో పాసింజర్ రైలును వేయాలని కోరారు. సభ్యులు బి.సత్యనారాయణ, కె.శ్రీరామ్మూర్తి, లోలుగు సింహాచలం, పేరూరి శ్రీనివాసరావు, పి.సింహాచలం తదితరులు ఉన్నారు.

చెట్టు కొమ్మలు పడి.. ట్రాఫిక్ అంతరాయం


కొమ్మలను తొలగిస్తున్న దృశ్యం

కవిటి: కవిటి-సోంపేట రోడ్డులోని జుత్తుపుట్టుగ గ్రామ జంక్షన్ వద్ద ఉన్న మర్రిచెట్టు కొమ్మలు గురువారం సాయంత్రం రోడ్డుపై కూలాయిదీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోగా, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న సోంపేట అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని చెట్టు కొమ్మలను తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. విద్యుత్ సరఫరాను మెరుగుపర్చేందుకు సిబ్బంది చర్యలు చేపట్టారు.

జనసేన సభ్యత్వ నమోదు

ఇచ్ఛాపురం: ముచ్చింద్ర గ్రామంలో జనసేన పార్టీ నాలుగో విడత క్రియాశీల సభ్యత్వ నమోదు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పన దుర్యోధన రెడ్డి ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు. యువత ఉత్సాహంతో పాల్గొని సభ్యత్వాల నమోదు చేసుకున్నారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదు చేపడతామన్నారు. నాయకులు సాడి శంకర్‌రెడ్డి, పొన్నగంటి గణేష్ పాల్గొన్నారు.

కృష్ణమూర్తి మాస్టారుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో 30 ఏళ్ల పాటు ఉపాధ్యాయునిగా సేవలందించి, ఎంతోమందిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దిన సావుకారి కృష్ణమూర్తి మాస్టారు మరణం తీరని లోటని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. గురువారం సత్యసాయి పాఠశాల ఆవరణలో జరిగిన పెద్దకర్మలో పాల్గొన్న ఎమ్మెల్సీ మాస్టారు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, ప్రకాష్‌రావు పట్నాయక్, కారంగి మోహన్‌రావు, మామయ్య, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలి


అణువిద్యుత్ పనులను అడ్డుకుంటున్న మత్స్యకారులు

రణస్థలం: పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలని కొవ్వాడ గ్రామస్థులు డిమాండ్ చేశారు. గురువారం కొవ్వాడ ప్రాంతంలో జరుగుతున్న అణువిద్యుత్ కేంద్రం పనులను పలువురు అడ్డుకున్నారు. 21 మంది భూములకు సంబంధించిన పరిహారం ఇవ్వాలని, మరో 16 మందికి యూత్ ప్యాకేజీ ఇవ్వాలని, ఆ తర్వాతే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అల్లిపల్లి రాముడు, అప్పన్న, మైలపల్లి పట్టయ్య, నర్సింహమూర్తి, పలువురు మత్స్యకారులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

కలెక్టరేట్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్లతో ఆయన సీజనల్ వ్యాధులు, తాగునీరు, భారీ వర్షాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఔషధాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఎంనవీన్, డీఆర్వో ఎం.గణపతిరావు, జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, సీపీవో లక్ష్మీప్రసన్న, ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్, డీపీవో వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, డీఎంహెచ్ఓ బి.మీనాక్షి, డీఎంవో సత్యనారాయణ, డీసీహెచ్‌వో రాజ్యలక్ష్మి, ఆర్టీవో గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

కంచిలి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీవో ఐవీ రమణ ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. కాలువల్లో పూడిక తీయించడం, బావుల వద్ద, కొళాయిల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం మఠం సరియాపల్లి సచివాలయాన్ని సందర్శించారు. రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



ఇచ్ఛాపురం/ఆమదాలవలస: ర్యాలీలో పాల్గొన్న న్యాయాధికారులు, న్యాయవాదులు తదితరులు


నరసన్నపేట: మాట్లాడుతున్న న్యాయాధికారి హరిప్రియ

హెల్మెట్ వాడండి.. ప్రాణాలు కాపాడుకోండి

- కోర్టుల ఆధ్వర్యంలో అవగాహన
- జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు
- పాల్గొన్న న్యాయాధికారులు

ఇచ్ఛాపురం: ద్విచక్రవాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురైనప్పుడు ప్రాణాలతో బయటపడేందుకు హెల్మెట్ రక్షణగా నిలుస్తుందని జూనియర్ సివిల్ న్యాయాధికారి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ పి.ఫణీష్‌కుమార్ అన్నారు. కోర్టు ఆవరణలో హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కోర్టు ఆవరణ నుంచి పాత బస్టాండ్, మార్కెట్ జంక్షన్, దాసన్నపేట మీదుగా తిరిగి కోర్టు వరకు న్యాయవాదులు, విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులతోపాటు బార్ అధ్యక్ష, కార్యదర్శులు నందికి రమణయ్యరెడ్డి, రంగారావు న్యాయవాదులు జి.సీతయ్యరెడ్డి, దేవరాజ్‌రెడ్డి, నాగరాపు పాత్రో, ఎస్ఎల్ నారాయణ, అల్లాడ నారాయణ, రాంబాబు, బైరాగిరెడ్డి రంగారావు, ప్రేమలత, ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్స్ నాగేశ్వరావు, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా వినియోగించాలి

ఆమదాలవలస: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా వినియోగించాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.మణి అన్నారు. గురువారం పట్టణంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కణితి విజయలక్ష్మీబాయి ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీపీ సీపాన గోవిందరావు, న్యాయవాదులు పైడి వరహానరసింహం, గురుగుబిల్లి ప్రభాకరరావు, వాడవలస రాజేశ్వరరావు, అన్నెపు సత్యం తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణం

పొందూరు: హెల్మెట్‌తో ద్విచక్రవాహనాలపై ప్రయాణం అత్యంత సురక్షితమని పొందూరు జూనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారి బి.జ్యోత్స్న అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో గురువారం ఉదయం హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ కూడలి నుంచి సిస్టం కళాశాల వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పోలీస్, కోర్టు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో స్వీయ రక్షణ

పలాస: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను ధరించడం ద్వారా స్వీయరక్షణ పొందవచ్చని పలాస జూనియర్ సివిల్ న్యాయాధికారి యు.మాధురి కోరారు. ఈ మేరకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.విశ్వేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి జీఎంఎస్ అనిల్‌రాజు, న్యాయవాదులు తాండ్ర మురళీ మోహన్, కొమర దేవరాజు, రవికుమార్, జి.ప్రభాకర్, చిట్టిబాబు, బీఆర్కే పట్నాయక్, కోర్టు సూపరింటెండెంట్ కృష్ణ, ఏఎస్ఐ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: ర్యాలీలో పాల్గొన్న న్యాయాధికారి తదితరులు



పలాస: ర్యాలీలో పాల్గొన్న న్యాయాధికారి, న్యాయవాదులు

ప్రమాదం నుంచి రక్షణగా..

టెక్కలి: హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణానికి ప్రమాదమని జూనియర్ సివిల్ న్యాయాధికారి తేజా చక్రవర్తి అన్నారు. గురువారం అంబేడ్కర్ కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతాల్లో హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఎంవీఐ డి.సంజీవరావు, ఎస్ఐ వెంకటేశ్వరరావు, ఎక్సైజ్ సీఐ రామచంద్రమూర్తి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై ర్యాలీ

పాతపట్నం: హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ గురువారం పట్టణంలో నిర్వహించారు. మండల న్యాయసేవా సంఘం ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించకుంటే కలిగే నష్టాలపై నినాదాలు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీఈ సత్యనారాయణ, న్యాయవాదులు మెట్ట రామారావు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

కొత్తూరు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి మణి తెలిపారు. కొత్తూరులో ర్యాలీ నిర్వహించి హెల్మెట్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్, ఎంవీఐ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, స్థానికులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి

నరసన్నపేట: దిచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని స్థానిక మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి హరిప్రియ సూచించారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్ వద్ద న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.


టెక్కలి: ర్యాలీలో పాల్గొన్న న్యాయాధికారులు, పోలీసులు



పాతపట్నం: ర్యాలీలో పాల్గొన్న న్యాయవాదులు, కోర్టు సిబ్బంది



పొందూరు: అవగాహన ర్యాలీ..

ఎండీయూ ఆపరేటర్ చేతివాటం

- 40 రేషన్ బియ్యం బస్తాలు మాయం
- అధికారుల విచారణ

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళం గుజరాతీపేటలోని రేషన్ డిపో (నెంబర్ 0181049)లో 40 రేషన్ బియ్యం బస్తాలు మాయమైనట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఎండీయూ ఆపరేటర్ చేతివాటం చూపించినట్టు తేలింది. ఈ నెలకు సంబంధించి డీలర్ తరుణ్ 9,989 కిలోల రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ఎండీయూ ఆపరేటర్ నరేష్‌కి అప్పగించాడు. ఇందులో 7,575 కిలోల బియ్యం నరేష్ పంపిణీ చేశాడు. మిగిలిన 40 బియ్యం బస్తాలు (2,414 కేజీలు) తిరిగి డీలర్‌కు అప్పగించాలి. కానీ, వాటిని అప్పగించకపోవడంతో గురువారం డిప్యూటీ తహసీల్దార్ ఆరా తీశారు. దీంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు డీటీ.. డీలర్ తరుణ్‌తో పాటు ఎండీయూ ఆపరేటర్ నరేష్‌ను తన కార్యాలయానికి పిలిపించి విచారించారు. తన వద్దే బియ్యం మాయమైనట్టు నరేష్ అంగీకరించాడు. ఈ బియ్యాన్ని ఏం చేశాడో మాత్రం చెప్పలేదు. దీంతో ఎండీయూ వాహనాన్ని స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయంలో ఉంచారు. ఈ విషయాన్ని జేసీకి రెవెన్యూ అధికారులు వివరించారు. దీంతో శుక్రవారం విచారణకు హాజరుకావాలని డీలర్, ఎండీయూ ఆపరేటర్‌తో పాటు అసోసియేషన్ ప్రెసిడెంట్‌ను అధికారులు ఆదేశించారు.

రెడ్‌క్రాస్ సేవలు వెలకట్టలేనివి: జేసీ


ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న జేసీ నవీన్

కలెక్టరేట్: ఉత్తమ విలువలు, వెలకట్టలేని సేవలతో శ్రీకాకుళం రెడ్‌క్రాస్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం స్థానిక బాపూజీ కళామందిర్‌లో గురువారం నిర్వహించారు. రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యునాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెడ్‌క్రాస్ వార్షిక నివేదికను రెడ్‌క్రాస్ ఛైర్మన్ జగన్మోహనరావు, కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, ఇతర కమిటీ సభ్యులతో కలిసి విడుదల చేశారు. తొలుత జేసీ ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ జిల్లాలో ఒక మహోన్నత శక్తిగా ఎదిగిందని కొనియాడారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలను ప్రశంసించారు. పలువురిని సత్కరించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతోపాటు శ్రీకాకుళం, ఆమదాలవలస ఎమ్మెల్యేల సతీమణులు గొండు స్వాతి, కూన ప్రమీల, డీఐపీఆర్వో కె.చెన్నకేశవరావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పైడిగాం ప్రాజెక్టు నీరు విడుదల


నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

సోంపేట: పైడిగాం ప్రాజెక్టు నీటిని ఎమ్మెల్యే బెందాళం అశోక్ గురువారం విడుదల చేశారు. బాతుపురం వద్ద ఉన్న ప్రాజెక్టు వద్ద పూజలు చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టు మరమ్మతులకు గతంలో టీడీపీ ప్రభుత్వం రూ.9కోట్లు మంజూరు చేసిం దన్నారు. నాయకులు చిత్రాడ శ్రీనివాసరావు, సూరాడ చంద్రమోహన్, మద్దిల నాగేశ్వరరావు ఉన్నారు.

సాంకేతిక విద్యతో ఉజ్వల భవిత

ఎచ్చెర్ల: సాంకేతిక విద్యతో ఉజ్వల భవిత సాధించవచ్చునని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో రెండేళ్ల పీయూసీ పూర్తిచేసిన విద్యా ర్థులకు ఇంజనీరింగ్ బ్రాంచ్‌ల కేటాయింపు పత్రాలను గురువారం అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రణాళి కాబద్ధంగా చదివి లక్ష్యాన్ని చేరు కోవాలన్నారు. కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్ కృష్ణ చౌదరి, జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, మండల టీడీపీ అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, కూటమి నేతలు అన్నెపు భువనేశ్వరరావు, కొత్తకోట అమ్మినాయుడు, మెండ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్


ఎస్పీకి పుష్ప గుచ్ఛం అందిస్తున్న ఎన్ఈఆర్

శ్రీకాకుళం క్రైం: జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన కేవీ మహేశ్వర్ రెడ్డిని గురువారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఎస్పీకి పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

సిక్కోలులో వెయిట్ లిఫ్టింగ్ అకాడమీ


కేంద్ర మంత్రి రామ్మోహన్‌తో కరణం మల్లీశ్వరి

శ్రీకాకుళం స్పోర్ట్స్: ప్రపంచ స్థాయి వసతులు, సౌకర్యాలతో కూడిన వెయిట్ లిఫ్టింగ్ అకాడమీ నిర్మించాలని, అందుకు ప్రభుత్వం తరుపున శ్రీకాకుళంలో తగిన స్థలాన్ని సమకూర్చుతామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈ మేరకు ఢిల్లీలో గురువారం కేంద్ర మంత్రి రామ్మోహన్, ఒలింపిక్ పతక విజేత, శ్రీకాకుళం జిల్లా వాసి కరణం మల్లీశ్వరి భేటీ అయి పలు అంశాలపై చర్చించారు. ఒలింపిక్స్‌లో పతకం సాధించిన తొలి భారత మహిళా వెయిట్ లిఫ్టర్‌గా చరిత్ర సృష్టించిన రోజులు తనకు ఇప్పటికీ గుర్తున్నాయని, తెలుగు ఖ్యాతిని, సిక్కోలు గౌరవాన్ని అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పిన కరణం మల్లేశ్వరి అంటే జిల్లా ప్రజలు ఎంతగానో ఆదరిస్తారని కేంద్ర మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఢిల్లీ స్పోర్ట్స్ యూనివర్సిటీ మొదటి వైస్‌చాన్సలర్‌గా క్రీడాభివృద్ధికి ఆమె చేస్తున్న కృషిని అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించే నైపుణ్యాలున్న వారు తెలుగు రాష్ట్రాల్లో ఎంతోమంది ఉన్నారని, వారిని గుర్తించి సానపెడితే అద్భుతాలు సృష్టించవచ్చునని ఈ సందర్భంగా కరణం మల్లీశ్వరి మంత్రికి వివరించారు. త్వరలో శ్రీకాకుళానికి వస్తానని, క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ముందడుగు వేస్తానని ఆమె తెలిపారు.

డిగ్రీ ఇన్‌స్టెంట్ పరీక్ష ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ అనుబంధ కళాశాలలో నిర్వహించిన డిగ్రీ ఇన్‌స్టెంట్ పరీక్ష ఫలితాలు గురువారం విడుదల చేసినట్టు పరీక్షల విభాగం డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలియజేశారు. బీఏ, బీసీఏ, బీ.కాం, బీఎస్సీ కోర్సులకు సంబంధించి 241 మంది విద్యార్థులు హాజరు కాగా.. 231 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

బాధితులకు న్యాయం చేయండి

శ్రీకాకుళం క్రైం: న్యాయం కోసం స్టేషన్‌కి వచ్చే బాధితులకు చట్టప్రకారం సమస్య పరిష్కరించి న్యాయం చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. నగరంలోని ఒకటో పట్టణ పోలీసు స్టేషన్, పెద్దపాడు పోలీసు స్టేషన్లను గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు, పోలీసుల పనితీరుతో పాటు స్టేషన్‌కు వచ్చిన బాధితులను ఎస్పీ కలుసుకుని అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు


జలయమయమైన అలికాం-బత్తిలి రహదారి

సరుబుజ్జిలి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో గురువారం తెల్లవారుజాము నుంచి జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు కురిశాయి. కొన్ని రోజుల నుంచి వర్షం కోసం ఎదురుచూస్తున్న అన్నదాత ముఖాల్లో ఆనందం కనిపించింది. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురవకపోవడంతో రైతులు కొంతమేర నిరాశ చెందారు. ఇటీవల వంశధార కుడి ప్రధాన కాలువ ద్వారా నీరు విడుదల చేసినప్పటికీ కొన్ని గ్రామాల రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో ఎట్టకేలకు వర్షం కురవడంతో పొలాల్లో నీరు చేరడంతో నాట్లుకు అనుకూలంగా మారింది. అయితే చిన్నపాటి వర్షానికి మండల కేంద్రమైన సరుబుజ్జిలి జంక్షన్‌లో అలికాం-బత్తిలి ప్రధాన రహదారి భారీగా నీరు చేరి చెరువును తలపించేలా కనిపిస్తుంది. కల్వర్టులు మూసుకుపోవడంతో వర్షం కురిసిన ప్రతిసారి ఈ పరిస్థితి తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అప్రమత్తంగా ఉండండి

గార: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండలంలోని వీఆర్వోలు వారి పని చేసే ప్రదేశాల్లో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం.శ్రీను తెలిపారు. కలెక్టరేట్ నుంచి వచ్చిన ఆదేశాలు మేరకు గురువారం ఉదయం వీఆర్వోలందరిని అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. భారీ వర్షాలు కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే అవకాశం ఉందని, ముఖ్యంగా నదీ, సముద్ర తీర ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని కార్యాలయానికి తెలియచేయాలని ఆదేశించారు.

రిమ్స్ ఆసుపత్రికి ఎమ్మెల్యే శంకర్ వితరణ

అరసవల్లి: స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ రిమ్స్‌కి తనవంతు సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. మంత్రి అచ్చెన్నాయుడు గురువారం రిమ్స్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. మౌలిక సదుపాయాల కల్పనకు దాతల సహకారం తీసుకోవాలని మంత్రి సూచించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే శంకర్ తనవంతుగా 25 ఫ్యాన్లు అందిస్తానని తెలిపారు. అలాగే కాంట్రాక్టర్లు లక్ష్మణరావు 25 ఫ్యాన్లు, రామారావు 50 ట్యూబ్ లైట్లు అందజేస్తామని ముందుకు వచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సోంపేట: కొర్లాం సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లుకొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ జి.ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫీడర్ పరిధిలోని కొర్లాం, జేపీ కొత్తూరు, సందికొత్తూరు, బేసి రామచంద్రాపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఎచ్చెర్ల సబ్ స్టేషన్ పరిధిలో..

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 33/11 కేవీ లైన్ల నిర్వహణ నేపథ్యంలో ఎచ్చెర్ల, అనమిత్ర టౌన్‌షిప్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఎస్.బయ్యన్నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఇచ్ఛాపురం రూరల్ పరిధిలో..

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రూరల్ పరిధిలో 11కేవీ విద్యుత్ పనులు చేపట్టనుండడంతో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11కేవీ లొద్దపుట్టి ఫీడర్, 11కేవీ ధర్మపురం ఫీడర్ పరిధిలో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు లొద్దపుట్టి, ధర్మపురం, కొఠారి, ఇన్నేసుపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు తెలిపారు.

బడ్జెట్‌లో బీసీలకు కేటాయించాలి


రాజేష్

శ్రీకాకుళం అర్బన్: పార్లమెంట్ సమావేశాల్లో ఈ నెల 23వ తేదీన ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి లక్ష కోట్ల రూపాయలు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి బుడుమూరు రాజేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ బీసీలు పన్నులు కడుతున్నారు కానీ, వారికి కావలసినంత బడ్జెట్ కేటాయింపులు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు కులగణన చేపట్టాలని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేపట్టొద్దన్నారు. బీసీలకు బడ్జెట్‌లో అన్యాయం జరిగితే ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

నేటి నుంచి బీఈడీ పరీక్షలు

ఎచ్చెర్ల: బీఆర్ అంబేడ్కర్ అనుబంధ కళాశాలల్లో బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల విభాగం డీన్ ఎస్.ఉదయ్ భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆరు కేంద్రాల్లో నిర్వహించనున్న ఈ పరీక్షల్లో 1220 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, ఉదయం 9 నుంచి 12 గంటల మధ్య వరకు జరుగుతాయన్నారు.

21న జాబ్‌మేళా

రణస్థలం: స్థానిక ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రాంగణంలో ఈనెల 21న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమ యాజమాన్యం ప్రత్యేక రిక్రూట్‌మెంట్ డ్రైవ్ చేపట్టనుందని, ఇంటర్ మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీలో 60 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగపరుచుకోవాలని కోరారు. 18 నుంచి 20 సంవత్సరాల యువత అర్హులన్నారు. పూర్తి వివరాల కోసం ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ సిబ్బందిని కలవాలని పేర్కొన్నారు.

వర్సిటీకి మంచి పేరు తీసుకురావాలి

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ప్రత్యేక అవసరాల విద్యార్థులను బోధించే బీఈడీ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు వర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని వీసీ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో ఈ కోర్సు పూర్తిచేసిన విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర చాలా కీలకమన్నారు. ప్రత్యేక అవసరాల విద్యార్థులపై చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, వర్సిటీ ప్రిన్సిపాల్స్ ఎం.అనూరాధ, విద్యా విభాగం సమన్వయకర్త హెచ్.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.